క్లుప్తంగా

రేపు నాదస్వర కచ్చేరి

బంగారుపాళెం: మండలంలోని మొగిలి గ్రామంలో సోమవారం నాయీబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో కర్ణాటక సంగీత నాదస్వర కచ్చేరి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆలిండియా రేడియో, టీటీడీ, కంచికామకోటి పీఠం, కాణిపాకం దేవాలయ ఆస్థాన డోలు, నాదస్వరం విద్వాన్‌లతో ఉదయం 9 గంటలకు నాదస్వర కచ్చేరి కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. రాత్రి కామధేను వాహన సేవ ఉంటుందని చెప్పారు.

సమష్టి కృషితోనే అభివృద్ధి

చిత్తూరు రూరల్: చిత్తూరును అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు సమష్టిగా కృషి చేయాల్సిన అవసరముందని స్మార్ట్ సిటీ డెవలప్‌మెంట్ సొసైటీ సభ్యులు తెలిపారు. నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో శనివారం వారు విలేకరుతో మాట్లాడారు. చిత్తూరు ఓవర్ బ్రిడ్జి మరమ్మతులకు గురైందన్నారు. ఆ బ్రిడ్జి పునర్నిర్మాణ పనులు చేపట్టాల్సి ఉందని చెప్పారు. హైరోడ్డు విస్తరణ పనులు త్వరితగతిన చేస్తే ట్రాఫిక్ సమస్యలు పరిష్కారమవుతాయని పేర్కొన్నారు. జిల్లా కేంద్రానికి యూనివర్సిటీ తీసుకురావాల్సిన అవసరముందన్నారు. కార్యక్రమంలో అధ్యక్షులు తాండవమూర్తి, కార్యదర్శి శివకుమార్, సభ్యులు అశోక్‌కుమార్, మురళి పాల్గొన్నారు.

తల్లిదండ్రుల నుంచి రక్షణ కల్పించండి!


విలేకరులతో మాట్లాడుతున్న ప్రేమ జంట

చిత్తూరు రూరల్: ''మేం ఇద్దరం మేజర్లం...ప్రేమించి పెళ్లి చేసుకున్నాం..మా పెద్దల నుంచి ప్రాణహాని ఉందని మాకు రక్షణ కల్పించండి.'' అంటూ ఓ ప్రేమ జంట శనివారం చిత్తూరు ప్రెస్‌క్లబ్‌ను ఆశ్రయించింది. నగరంలోని గురప్పనాయుడువీధికి చెందిన జాహ్నవి (19) ఇంటర్ వరకు చదువుకోగా, ఎం.ఎం కోవిల్ స్ట్రీట్‌కు చెందిన భానుచందర్ (23) డిగ్రీ పూర్తి చేశాడు. ఇద్దరూ కొన్నేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. ఇద్దరిదీ ఒకే కులమైనప్పటికీ ఇరు కుటుంబాల పెద్దలు వీరి పెళ్లికి అంగీకరించలేదు. ఈ క్రమంలో ఇద్దరు ఇంట్లోంచి వెళ్లిపోయి పెళ్లి చేసుకున్నారు. ఈ విషయం యువతి తల్లిదండ్రులకు తెలియడంతో వారి నుంచి తమకు ప్రాణహాని ఉందని మీడియాను ఆశ్రయించారు. ఇదే విషయమై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.

కల్యాణ మండపానికి రూ.15లక్షల విరాళం


ఎన్‌ఆర్‌ఐ కుటుంబాన్ని సన్మానిస్తున్న గ్రామస్తులు

గుడిపాల: కల్యాణ మండపం నిర్మించేందుకు ఎన్‌ఆర్‌ఐ రూ.15 లక్షల విరాళాన్ని శనివారం అందజేశారు. మండలంలోని పాపసముద్రం గ్రామానికి చెందిన ఎన్‌ఆర్‌ఐ శ్రీరాములురెడ్డి, శ్రీదేవి పిళ్లారికుప్పంలోని ద్రౌపదీ సమేత ధర్మరాజుల గుడిని సందర్శించారు. ఇక్కడే కల్యాణ మండపం నిర్మించాలని గ్రామస్తులు నిర్ణయించడంతో ఇందుకుగాను ఆర్థిక సాయం చేయాలని ఆయన్ను కోరారు. ఆయన కల్యాణ మండపానికి రూ.15 లక్షలు విరాళాన్ని గ్రామస్తులకు అందజేశారు. ఆయనతోపాటు సర్పంచ్ చిట్టిబాబు, మాజీ సర్పంచ్ భానుమూర్తిరెడ్డి, గ్రామస్తులు పాల్గొని ఆయన్ని సన్మానించారు.

గో సంరక్షణ ట్రస్టుకు రూ.లక్ష విరాళం

కాణిపాకం(యాదమరి): కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామి గో సంరక్షణ ట్రస్టుకు బెంగళూరుకు చెందిన లక్ష్మీనారాయణ రూ.లక్ష విరాళాన్ని అందించారు. దాత కుటుంబ సభ్యులు శనివారం స్వామివారి దర్శనార్థం విచ్చేసి గో సంరక్షణ ట్రస్టుకు రూ.లక్ష విరాళం అందించారు. అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి స్వామివారి తీర్థ ప్రసాదాలు అందించారు.

చదువుతోపాటు క్రమశిక్షణ ముఖ్యం


విజేతలకు సర్టిఫికెట్లు అందిస్తున్న అతిథులు

చిత్తూరు కలెక్టరేట్: విద్యార్థులకు చదువుతోపాటు క్రమశిక్షణ ముఖ్యమని ఏపీఎస్‌పీడీసీఎల్ రిటైర్డ్ ఏవో ఎర్రయ్య అన్నారు. స్థానిక నాగయ్య కళాక్షేత్రంలో శనివారం విజయం జూనియర్ కళాశాల 14వ వార్షికోత్సవం నిర్వహించారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. పలు పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు అతిథులు బహుమతులను అందజేశారు.

జాతీయ పోటీ ఫలితాలు విడుదల

పలమనేరు: పలమనేరు పట్టణానికి చెందిన తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి జాతీయ స్థాయిలో మాతృభాషపై విద్యార్థులకు నిర్వహించిన పోటీల ఫలితాలను ఆ సమితి అధ్యక్షులు తులసీనాథం నాయుడు శనివారం ఓ ప్రకటనలో ప్రకటించారు. వీరికి ఈనెల 21న పలమనేరులో జరిగే మాతృభాషా దినోత్సవం సందర్భంగా ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలను అందజేయనున్నట్టు తెలిపారు.


యాదమరి: ఆదిశేష వాహనంపై విహరిస్తున్న శివపార్వతులు


తవణంపల్లె: లింగేశ్వరస్వామికి మహారుద్రాభిషేకం


గుడిపాల: వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణోత్సవం


చిత్తూరు: శ్రీకుబేర ఉమామహేశ్వర స్వామి ఆలయంలో...

త్రిగుణాకారం.. త్రినేత్రం.. పాపసంహారం


బంగారుపాళెం: మొగిలీశ్వరస్వామి


గుడిపాల: యజ్ఞేశ్వరస్వామి, జ్ఞానప్రసూనాంబ


చిత్తూరు: కల్యాణోత్సవంలో స్వామిఅమ్మవార్లు


తవణంపల్లె: భైరవునిపై శ్రీ కాళభైరేశ్వర స్వామి


గుడిపాల: భద్రకాళమ్మ

- హరహర మహదేవ..శంభో శంకరా..!
- ఘనంగా శివరాత్రి వేడుకలు
- భక్తులతో పోటెత్తిన శైవాలయాలు
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు

చిత్తూరు రూరల్: మహా శివరాత్రి సందర్భంగా జిల్లా వ్యాప్తంగా శైవలయాలన్నీ భక్తులతో పోటెత్తాయి. ఉదయం నుంచి రాత్రి వరకు ఆలయాల్లో శివనామ స్మరణ మార్మోగింది.

ఈశ్వరగుడివీధిలోని శ్రీ అగస్తీశ్వర ఆలయంలో సుప్రభాత సేవలో స్వామిని మేల్కొలిపి రుద్రాభిషేకం చేసి ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఉదయం నుంచి భక్తులు క్యూకట్టారు. భక్తులకు అన్నదానం చేశారు.

కట్టమంచిలోని కుళందీశ్వరస్వామి ఆలయంలో భక్తులు పాలాభిషేకం చేశారు. అనంతరం స్వామి అమ్మవార్ల కల్యాణోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులతో ఆలయం కిటకిటలాడింది.

-ఇరువారంలోని శ్రీ నాగేశ్వరస్వామి ఆలయంలో మహాభిషేకం చేశారు. సంతపేటలోని శ్రీకుభేర ఉమామహేశ్వరస్వామి ఆలయంలో గజేశ్వర అవతారంలో స్వామి వారు భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు శివలింగానికి పాలాభిషేకం చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

శివపార్వతుల కల్యాణోత్సవం

నగరంలోని శ్రీషిరిడి విశ్వసాయిబాబా ఆలయంలో శనివారం రాత్రి శివపార్వతుల కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శాస్త్రోక్తంగా వేదపండితులు కల్యాణోత్సవాన్ని జరిపించారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్ చైర్‌పర్సన్ సీకే లావణ్య పాల్గొన్నారు.

కుళందీశ్వర స్వామి సేవలో ఎమ్మెల్యే ఆరణి

చిత్తూరు నగరం కట్టమంచిలోని శ్రీకుళందీశ్వర స్వామి వారిని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు దర్శించుకున్నారు. జంగాలపల్లిలోని ఈశ్వర ఆలయంలో జరిగిన శివరాత్రి మహోత్సవంలో పాల్గొన్నారు.

వీరబ్రహ్మేంద్ర స్వామి కల్యాణోత్సవం

గుడిపాల: మండలంలోని 197రామాపురంలో జ్ఞాన ప్రసూనాంబా యజ్ఞేశ్వరస్వామి ఆలయంలో అభిషేకాలు నిర్వహించారు. శివపార్వతుల కల్యాణోత్సవం చేశారు. ఉత్సవ మూర్తులను ఊరేగించారు. గ్రామంలోని వీరబ్రహ్మేంద్రస్వామి మఠములో గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి వార్ల కల్యాణోత్సవం ఘనంగా జరిగింది. నరహరిపేట చెక్‌పోస్ట్ వద్ద భద్రకాళమ్మకు విశేష పూజలు చేశారు. కట్టకిందపల్లెలో ఉన్న గంగమ్మ, కోలావూరులో ఉన్న మల్లీశ్వరునికి అభిషేకాలు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు.

యాదమరిలో..

యాదమరి: స్థానిక శివాలయంలో వేకువజామున ప్రత్యేక అభిషేకాలు, రుద్రాభిషేకాలు నిర్వహించి పూజలు చేసి, భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు స్వామివారికి ఉలవలతో నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఉత్సవ మూర్తులను రాత్రి ఆదిశేష వాహనంపై పుర వీధుల్లో ఊరేగించారు. భక్తులు స్వామివారికి కర్పూర మంగళ హారతులు ఇచ్చి పూజలు చేశారు.

పెరుమాళ్ల పల్లెలో......

మండలంలోని పెరుమాళ్ల పల్లెలో వెలసిన వీరబ్రహ్మంగారి ఆలయంలో అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. సాయంత్రం గోవిందమ్మ, బ్రహ్మేంద్ర స్వామికి కల్యాణం చేశారు. రాత్రి నూతన వధూవరులను శేషవాహనంపై గ్రామ వీధుల్లో ఊరేగించారు.

భక్తజన సంద్రంగా మొగిలి

బంగారుపాళెం: మండలంలోని మొగిలీశ్వరాలయంలో భక్తజనసంద్రంగా మారింది. ఆలయంలో స్వయంభు శ్రీ మొగిలీశ్వర సామి, కామాక్షమ్మ వారికి ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు. అర్ధరాత్రి 12 గంటలకు లింగోద్భవ అభిషేకం అనంతరం స్వామి, అమ్మవారిని వృషభవాహనంపై ఊరేగించారు. మహాసముద్రం గ్రామంలోని పురాతన శివాలయం శ్రీమహదీశ్వరాలయం, చీకూరుపల్లెలోని సిద్దేశ్వరస్వామి, వజ్రాలపురంలోని శ్రీజలకంఠేశ్వరాలయంలో మహాశివరాత్రి పూజలు నిర్వహించారు, భక్తులకు అన్నప్రసాదాలను పంపిణీ చేశారు.

నేడు రావణబ్రహ్మవాహనం

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం ఉదయం అభిషేకం, కైలాసగిరి రావణ బ్రహ్మ వాహనం, రాత్రి శేషవాహన సేవలను నిర్వహించనున్నట్లు ఈఓ తెలిపారు.

పూతలపట్టులో..

పూతలపట్టు: స్థానిక శివాలయంలో వేకువజామున అభిషేకం నిర్వహించారు. అనంతరం వజ్జిరెడ్డిపల్లి నాగాలమ్మ కొండ, పోటుకనుమ సిద్దేశ్వరుని ఆలయం, మిట్టూరు బాటగంగమ్మ, పలుచోట్ల శివునికి ప్రత్యేక పూజలు చేసి వచ్చిన భక్తులకు ప్రసాదం అందజేశారు.

ప్రత్యేక ఆకర్షణగా బాటగంగమ్మ ఆలయం

మండలంలోని తేనేపల్లి సమీపంలో బాటగంగమ్మ ఆలయానికి భక్తులు తండోపతండంగా తరలివచ్చారు. రాత్రి జాగారణ కోసం పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆలయ నిర్వాహకులు ఏర్పాటు చేశారు. ఈరోజు ఉదయం(ఆదివారం) 2 గంటల సమయంలో అగ్నిగుండ ప్రవేశం నిర్వహించనున్నారు. దీనికి పక్క రాష్ట్రాల నుంచి తరలి వచ్చారు.

ఓం హర హర శంకర మహా దేవా

తవణంపల్లె: మండల కేంద్రంలోని శ్రీ కాళభైరేశ్వర స్వామి దేవస్థానంలో మహాశివరాత్రి వేడుకలను భక్తిశ్రద్ధతో నిర్వహించారు. ఉదయం అంకురార్పణ, కలశప్రతిష్ట, గణపతి హోమం, లక్షబిల్వార్చన, శివకోటి నామస్మరణ నిర్వహించారు. ప్రదోషకాలంలో నందీశ్వరునికి అభిషేకం పూజలు చేయించారు. ఆలయ ఆవరణలో మృత్యుంజయ హోమం, లలితసహస్రనామం, పూర్ణాహుతి, మహారుద్రాభిషేకం భక్తిప్రపత్తులతో నిర్వహించారు. రాత్రి 7 గంటలకు శివమాల భక్తులు అగ్నిగుండ ప్రవేశం చేశారు. రాత్రి 12 గంటలకు పాలాభిషేకం చేయించారు.

దిగువ మోదలపల్లెలో..

మండలంలోని దిగువ మోదలపల్లె ఆరివేణి గంగమ్మ గుడిలో ప్రత్యేక పూజలు చేశారు. పల్లకిలో కొలువుదీరిన వీరభద్ర స్వామిని ఎత్తుకొని భక్తులు అగ్నిగుండ ప్రవేశం నిర్వహించారు. ఆవలకొండలో(సిద్ధేశ్వర కొండ) వెలసిన సిద్ధేశ్వర స్వామికి విశేష పూజలు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు.

భైరవ వాహనసేవ

మండల కేంద్రంలోని కాళభైరేశ్వర స్వామి, భైరవ వాహనంపై ఊరేగారు. భక్తులు స్వామికి పూజలు మొక్కులు తీర్చుకొన్నారు. ఉదయం కాళభైరేశ్వర స్వామికి కాణిపాకం ఆలయం నుంచి పూతలపట్టు ఎమ్మెల్యే ఎం.ఎస్.బాబు, ఆలయ ట్రస్టుబోర్డు ఛైర్మన్ మోహన్‌రెడ్డి అర్చకులు పట్టువస్త్రాలను తీసుకొచ్చి సమర్పించారు. అర్ధగిరి శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానం తరపున ఆలయ ఈఓ వెంకటసుబ్బారెడ్డి, ట్రస్టుబోర్డు సభ్యులు కాళభైరేశ్వరస్వామికి పట్టువస్త్రాలు సమర్పించారు. ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో జ్యోతిర్లింగాల ప్రదర్శనను భక్తులు తిలకించి పునీతులయ్యారు.

పట్టు వస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే

బంగారుపాళెం: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం ఉదయం స్వయంభు శ్రీమొగిలీశ్వరస్వామి వారికి, మహాసముద్రం గ్రామంలో వెలసిన శ్రీమహ దీశ్వరస్వామి వారికి కాణిపాక ఆలయం తరపున పట్టువస్త్రాలు సమర్పించారు. పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు, కాణిపాక వినాయకస్వామి ఆలయ ఛైర్మన్ మోహన్‌రెడ్డి, ఈఓ వెంకటేశులు, పట్టు వస్త్రాలను ఆయల కార్యనిర్వాహణాధికారి మునిరాజకు అందజేశారు. సిబ్బంది ఆలయ మర్యాదలతో వారికి స్వాగతం పలికి శ్రీమొగిలీశ్వర స్వామి, కామాక్షమ్మ వారి దర్శనం కల్పించారు.

మణికంఠేశ్వర స్వామికి

ఐరాల: మండలంలోని మఠంపల్లెమిట్టలో వెలసి ఉన్న మణికంఠేశ్వరాలయం, కుల్లంపల్లెలో శివాలయంలో మహాశివరాత్రి సందర్భంగా శనివారం కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామి ఆలయం తరపున ఎమ్మెల్యే ఎంఎస్ బాబు, కాణిపాకం ఆలయ చైర్మన్ మోహన్‌రెడ్డి స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. వారికి ఆలయ వంశపారంపర్య ధర్మకర్త ధనచంద్రారెడ్డి, అర్చకులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. అనంతరం స్వామి వారికి ఎమ్మెల్యే పట్టు వస్త్రాలు సమర్పించి, రుద్రాభిషేకం పూజలో పాల్గొన్నారు. అర్చకులు వేద ఆశీర్వచనం చేసి తీర్థప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ బుజ్జిరెడ్డి, పూజారి మోహన్‌రెడ్డి, సర్పంచులు శాంతిసాగర్‌రెడ్డి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.


చిత్తూరు: ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుకు ప్రసాదం అందజేస్తున్న ఆలయ నిర్వాహకులు


బంగారుపాళెం: మొగిలీశ్వరునికి పట్టువస్త్రాలు తీసుకువస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ బాబు


చిత్తూరు: హారతులు అందుకుంటున్న భక్తులు


తవణంపల్లె: భక్తులు తీసుకొస్తున్న కలశాలు


తవణంపల్లె: కాళభైరేశ్వర ఆలయంలో లక్షబిల్వార్చనకు హాజరైన భక్తులు


ఐరాల: శివయ్యకు పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న ఎమ్మెల్యే, ఆలయ చైర్మన్, నాయకులు


పూతలపట్టు: భక్తులతో సందడిగా ఉన్న బాటగంగమ్మ ఆలయం


యాదమరి: శివాలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు


చిత్తూరు: కుబేర ఉమామహేశ్వరస్వామి ఆలయం వద్ద క్యూలో వేచిఉన్న భక్తులు


బంగారుపాళెం: మొగిలీశ్వరాలయంలో బారులు తీరిన భక్తులు

కార్పొరేట్ కళాశాల.. నిష్ప్రయోగశాల

- నిబంధనలు పాటించని ప్రైవేటు కళాశాలలు
- వాటి వైపు కన్నెత్తి చూడని విద్యాశాఖాధికారులు
- ఈ నెల 20 నుంచి మార్చి 7 వరకు ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు



• నగరంలోని కొంగారెడ్డిపల్లెలో ఉన్న ఓ ప్రైవేట్ కళాశాలలో 125 మంది సైన్సు విద్యార్థులు ఉన్నారు. భౌతిక శాస్త్రం ప్రయోగశాలకు విద్యుత్ సరఫరా లేదు.. రసాయన ప్రయోగశాలలో రసాయనాలే లేవు.

• నగరంలోని గిరింపేటలో ఉన్న మరో కార్పొరేట్ కళాశాలలో ప్రాక్టికల్స్ బోధించేందుకు విద్యార్థుల సంఖ్యకు సరిపడా అధ్యాపకులే లేరు. ఉన్న వారే అందరికీ ఏదో సిలబస్ పూర్తి చేశామా అన్న కోణంలో కానిచ్చేస్తున్నారు. ఇదే పరిస్థితి నియోజకవర్గంలోని 80 శాతం కళాశాలల్లో నెలకొంది.

చిత్తూరు కలెక్టరేట్: నియోజకవర్గంలోని పలు ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలల్లో ప్రయోగశాలలు లేవు. ఒక వేళ ఉన్నా వాటిలో ప్రయోగాలు చేసిందే లేదు. అయినప్పటికీ ఇంటర్మీడియట్ అధికారులు ఆ కళాశాలలకు అనుమతులు ఇచ్చేస్తున్నారు. ఇంటర్మీడియట్ విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలు ఎంతో కీలకం. ఈ నెల 20నుంచి ఇంటర్ ఒకేషనల్, 27 నుంచి రెగ్యులర్ విద్యార్థులకు ప్రయోగ పరీక్షలు నిర్వహించేందుకు అధికారులు సన్నద్ధమయ్యారు. అయితే పలు కళాశాలల్లో ప్రాక్టికల్స్ అంటే ఏమిటో కూడా తెలియని విద్యార్థులు చాలా మంది ఉన్నారంటే అతిశయోక్తి కాదు. ఇంటర్మీడియట్ అధికారులు ప్రైవేట్ కళాశాలల్లో ల్యాబ్‌ల వైపు కన్నెత్తి చూడకపోవడంతో వారు అలసత్వం వహిస్తున్నారన్న చర్చ మొదలైంది.

రెండు నియోజకవర్గాల్లో ఇలా

చిత్తూరు, పూతలపట్టు నియోజకవర్గాల్లో 22 ప్రభుత్వ, ప్రైవేటు, కార్పొరేట్ కళాశాలలతో పాటు ఏపీ రెసిడెన్షియల్, ఏపీఎస్‌డబ్ల్యూఆర్, ఒకేషనల్ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. ఇందులో ఈ ఏడాది ప్రాక్టికల్ పరీక్షలకు ఇంటర్ రెండవ సంవత్సరం విద్యార్థులు దాదాపు 1,875 మంది హాజరుకానున్నట్లు ఇంటర్మీడియట్ అధికారుల గణాంకాలు వెల్లడిస్తున్నాయి. పరీక్షల నిర్వహణకు సైన్సు విద్యార్థుల నుంచి రుసుము వసూలు చేశారు. పరీక్షల తేదీ సమీపిస్తున్నా నేటికీ పరికరాలు, రసాయనాలు అందుబాటులో లేకపోవడంతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు.

సర్దుకుపోవాల్సిందే

• ప్రయోగశాల పరీక్షలకు సంబంధించి ఒక్కో విద్యార్థి నుంచి రూ.200 వరకు రుసుము వసూలు చేశారు. ఈ మొత్తంతో అవసరమైన పరికరాలు, సామగ్రి, రసాయనాలు కొనుగోలు చేయాల్సి ఉంది.

• బైపీసీలో బోటనీ, జువాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీకి సంబంధించి నాలుగు ప్రయోగశాలలు, ఎంపీసీలో ఫిజిక్స్, కెమిస్ట్రీ ల్యాబ్‌లు అందుబాటులో ఉండాలి. అయితే పలు కళాశాలల్లో ల్యాబ్‌లు లేనే లేవు. కొన్ని చోట్ల ఉన్నప్పటికీ పరికరాలన్నీ బీరువాలకే పరిమితమయ్యాయి.

• చాలా ప్రైవేటు కళాశాలల్లో సరిపడా గదులు లేకపోవడంతో ఏర్పాట్లు అంతంత మాత్రంగానే సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. ఉన్న పరికరాలతోనే ప్రాక్టికల్స్ నిర్వహించేందుకు రసాయనాలు సమకూర్చుకునే పనిలో కొన్ని కళాశాలల యాజమాన్యాలు నిమగ్నమయ్యాయి.

నిత్యం తనిఖీలు చేస్తున్నాం



ఇంటర్ బోర్డు కమిటీ సభ్యులు తనిఖీ చేస్తున్నారు. ఎక్కడ లోపాలు ఉన్నాయో ఆ కళాశాలకు హెచ్చరికలు జారీచేసి ల్యాబ్‌లు ఏర్పాటు చేసుకోవాలని అవకాశం ఇచ్చాం. ప్రాక్టికల్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు చేపడుతున్నాం. సీసీ కెమెరాలు పరీక్ష కేంద్రాల్లో తప్పనిసరి. విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేలా ఏర్పాట్లు చేస్తున్నాం.

– రమేష్, ఆర్‌ఐవో, చిత్తూరు జిల్లా

ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలి


పనులు పరిశీలిస్తున్న కమిషనర్ అరుణ

చిత్తూరు అర్బన్: జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలని మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ అరుణ ఆదేశించారు. నగరంలోని తేనెబండ కాలనీలో శనివారం జరుగుతున్న పనులను కమిషనర్ పరిశీలించారు. ఇక్కడున్న అధికారులతో మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాలు నిర్ణీత సమయంలో పూర్తిచేయాలని సూచించారు. మౌలిక వసతులు, సదుపాయాలకు సంబంధించి పనులు వేగవంతం చేయాలని చెప్పారు. సచివాలయ కార్యదర్శులు స్టేజ్ కన్వర్షన్లు పూర్తిచేసి ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేయాలన్నారు.

ఆరుగురు జూదరుల అరెస్టు

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలో పేకాట ఆడుతున్న ఆరుగురు నిందితులను వన్‌టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. నగరంలోని ఆర్టీసీ బస్టాండు వద్ద పేకాట ఆడుతున్నట్లు సీఐ నరసింహరాజుకు సమాచారం అందింది. శనివారం మధ్యాహ్నం సీఐ ఆదేశాలతో ఎస్‌ఐ రమేష్ తన సిబ్బందితో కలిసి ఆర్టీసీ బస్టాండు వద్ద దాడులు చేశారు. ఇక్కడ పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్టు చేసి, రూ.18,690 నగదును సీజ్ చేశారు.